# తాత పిల్లలు

-చావా శివకోటి

జీవితం, సత్యం కోసం దేనినయినా వదిలేయవచ్చు. కాని సత్యాన్ని దేనికోసమూ వదలకూడదు. వదిలితే మనిషి మనుగడ ప్రశ్నార్థకమౌతుంది. సత్యం ఇచ్చే తృప్తికి ఎల్లలు లేవు. అనంతానంతమైనది. నిజానికి ఇది కథ కాదు. కథ లాంటిదీ కాదు. మరెందుకు చెప్పడం?

నా బ్రతుకున ఓ చిన్న అనుభవమిది. యథాతథంగా చెప్పాలనిపించింది. మరచిపోలేక, చెప్ప ప్రయత్నిస్తున్నాను. మనం పనొచ్చినపుడు రెలులోనో, బస్సులోనో ప్రయాణం చేస్తుంటాం. అలా ప్రయాణం చేసేప్పుడు- మనం ఎక్కడికి వెళ్తామో అక్కడకు టిక్కెట్టు తీసుకుంటాం. ఒక్కళ్ళం ఎక్కం గదా! మందితో కలిసి ఎక్కుతాం. నల్గురులో కూర్చుంటాం. కూర్చున్నాక అజుబాజులు గమనిస్తాం. మాట కలుపుతాం. నవ్వుతాం. కోప్పడతాం. ఇందులో వాహనం ఎక్కే దిగే ఆరాటం తప్ప- ఆత్మీయత కనిపించదు. ఎక్కాక లగేజిని జాగ్రత్తగ చూసుకొనడం- తన వెంట ఎక్కిన తనవార్ని అరుసుకొనడం- వగైరా ముఖ్యం. ఆనక ఈ ప్రయాణాన కాలక్షేపం కోసం పలకరించుకుంటాం. మాటాడుకుంటాం. ఆ మాటలకు తాత్కాలికంగా స్పందిస్తాం. సమాధానమిస్తాం. అడుక్కునే వాళ్ళొస్తే అర్ధో పావలో ఇస్తాం. లేదా చిల్లర లేదని విసుక్కుంటాం. చిరుతిళ్ళు వస్తే కొని నముల్తాం. ఇంతలో దిగే 'అడ్డా' రానే వస్తుంది. గబగబా లేచి, లగేజ్ చూసుకొని- తన వారిని గదుముకుంటూ దింపి దిగిపోతాం- ఆ తొందరన తొక్కుతూ వెళ్ళినా చీదరగా చూస్తుంటాం. ఏమి మిగిలినట్లనిపించదు. ఇంతలో వాహనం కదులుతుంది. ఆనక ఎవరికి ఎవరో?

మనం పొరపాటున ఇందులో మనస్సుంచితే మాత్రం- ఎక్కడ కలుక్కుమంటుంది. మనస్సు నడకన కొద్దిగ గండ్లుపడి లుంగ చుట్టుకుంటుంది.

అలాటిదే ఇదీనూ-

బాగా ఆలోచిస్తే- ఇదీ కాదనిపిస్తుంది. చదువుతున్నారు గనుక అదేదో మీకైతేనే తెలుస్తుంది.

మాది ఖమ్మం దగ్గర ఓ పల్లెటూరు. ఓ మాదిరిగ విద్యాగంధం ఉన్న ఊరే! ఊరి నడత. పాతిక ఏళ్ళనాడు గుంట నక్కల వాతన పడింది. ఉన్నగాడి చెదిరింది. కనుక దాని ఆలోచనాక్రమం. గుంట చిక్కుల నుంచి క్షేమాన్ని వెతుక్కుంటున్నది. ఆ వరవడిన- అరాచక ధోరణే రాచరికంగా చలామణి అవుతున్నది.

ఒకనాడు డాట్‌కామ్ (DOTT COM) నుంచి సాంబిరెడ్డి గారు (Agriculture Scientist) మా ఇంటికి వచ్చారు. ఆయన నాకు నాలుగేళ్ళుగా పరిచితుడే గాక స్నేహితుడు కూడా. బాధ్యత ఎరిగిన ఉద్యోగి. మా పైర్లకు ఏ రకమైన చీడపీడలు వచ్చినా కబురు చేయగానే వచ్చి చూసి నివారణోపాయం చెప్పి వెళ్తుంటాడు. ఇటుగ ఎప్పుడు వచ్చినా- నా దగ్గిర ఆగి- ఉన్న పైరుల స్థితిగతులను కనుక్కొని, ఇచ్చిన కాఫీ తాగి వెళ్ళడం అలవాటు. అయితే ఆయన ఈసారి వచ్చినపుడు నేను లేను. నేలకొండపల్లిలో పని ఉండి వెళ్ళాను. అయితే- నేను తిరిగి వచ్చిందాకా మా ఇంట్లోనే కూర్చుని ఉన్నాడు. 'విష్' చేసి లోనకెళ్ళి- కాఫీ పెట్టే ప్రయత్నాన పడ్డాను.

నేను ఒంటరివాణ్ణి. ఊళ్ళో పిత్రార్జితం కొద్దిగ భూమి ఉన్నది. నాన్నగారు కట్టించిన లంకంత ఇల్లు మాత్రం ఉన్నది. లోగా ఎప్పుడూ నల్గురు తిరుగాడిన ఇల్లు. ఇప్పుడు నేనే మిగిలాను. తోడు కోసం- ఎవరినైనా పిలిచినా- వచ్చేవారు లేరు. పైగా నన్నే రమ్మంటున్నారు. దగ్గరి వాళ్ళు- ఆత్మీయులూను. అయినా పోలేను. అక్కడ ఇమడలేమోనన్న భయం. మనం అసలు పోయాక మాత్రం అంతా తప్పక వస్తారు. చూసి పారేసిపోతే- సరిపోతదని- మళ్ళీ ఇటుగ వచ్చే పనిని తప్పించామనీ-

నేను- కాఫీ కలిపి- తెచ్చి ఆయనకిచ్చి ఎదురుగ కూర్చున్నాను.

నెమ్మదిగా- వచ్చిన పని అడిగాను.

'ఆఁ! అదే! ఇక్కడకు అశ్వారావుపేట ఎన్.జి. రంగా వ్యవసాయ కళాశాల నుంచి RAWEP పూర్తి చేసేందుకు- పిల్లలు ఇక్కడికి వస్తున్నారు. ఆడపిల్లలున్నారు. వార్ని ఇక్కడ మన ఇంట్లో ఉంచితే భద్రతగ ఉంటుందన్న భావన ఉన్నది. మీరు 'సరే' నంటే- అన్నాడు.

'ఎందరు? ఎన్ని దినాలుంటారు?' అడిగాను అనాలోచితంగా.

"నాల్గు నెలలుంటారు. పైరులూ- వాటి ఎదుగుదలా- ఎదుగుదలలో వచ్చే రుగ్మతలూ- నివారణా- తీసుకోవాల్సిన చర్యలూ- చూస్తూ అధ్యయనం చేస్తారు. మా క్లాసులూ మధ్యమధ్యన ఉంటాయి. మధిర విత్తనోత్పత్తి (అపరాల) కేంద్రానికి కూడా అంతా వెళ్ళిరావాల్సి ఉంటుంది" అన్నాడు.

"ఈ పిల్లలు వయస్సొచ్చిన వారు. నేను వాళ్ళతో ఉండగలనా? ఇక్కడ వాళ్ళకు కావాల్సిన ప్రైవసీ దొరుకుతుందా?" అనుకొని 'చూద్దాం' అన్నాను. నవ్వగలిగేదీ నవ్వులపాలయ్యేదీ మనిషే గదా! ఆడపిల్లలతో పని- అందునా కాలేజీ పిల్లలు- అనుకున్నాను లోన.

అయితే సాంబిరెడ్డి గారు నన్నే చూస్తూ- 'ఆడపిల్లలు- మీరుంటారు గనుక' అన్నాడు. అంటే- వాళ్ళకు పెద్ద దిక్కుగ ఉండాలన్న భావన- ఆయన నమ్మకానికి తల ఊపాను- ఆయన్నే చూస్తూ.

అర్థం చేసుకొనగల మనస్సుంటే, ఆచరణ దాని వెంట వస్తుంది. అదీగాక- ఒంటరితనపు 'నీడ' నాకు తరుగుతుంది. ఆడిపిల్లలు గనుక సందడిగానూ ఉంటారు అనిపించింది.

'ఇంటికి అద్దె కూడా ఇస్తారు. స్టయిఫండ్ వస్తది' అన్నాడు.

'పిల్లలు గద సార్! అద్దె అక్కరలేదు. కరెంటు వాడకం ఉంటుంది గనుక బిల్లు కట్టుకోమనండి' అన్నాను.

'మంచిది. నేను వెళ్తాను.' అని లేచాడు- మోటారు సైకిలెక్కుతూ- '20 తేదీన వస్తారు' అన్నాడు.

తల ఊపాను.

'గమ్యం చెప్పి- చూపేవాడే గురువు' అనిపించింది- ఆయన్ను చూస్తుంటే.

◇◇◇

చీకటంటే భయమెందుకు? మట్టి ప్రమిద నూనె వేసి వెలిగిస్తే చాలు. 'వెలుగు' ఎంతో కొంత మొదలవుతది. చేసే పని ఎంత చిన్నదయినా- పెద్దదయినా- చిత్తశుద్ధితో చేస్తే చాలు. మార్గం సుగమమవుతది. మనిషి బ్రతుక్కు బహుముఖాలు. మరెన్నో కోణాలు. సమాజాన బ్రతుకుతున్నాం గనుక- వీలయినంత అన్ని కోణాల నుంచీ చూడగలగాలి. అప్పుడు 'నిజం' యొక్క రూపు అర్థమవుతది. సుదర్శనం మా దగ్గర ఓ రైతు. నా ఒంటరితనం పై అతనికి జాలి కనుక అతనికి తీరి దొరికినపుడల్లా నా దగ్గరకు వస్తుంటాడు. లోకాభిరామాయణం మాటాడుకుంటుంటాం. ఆవేళ సుదర్శనం వచ్చాడు. కూర్చున్నాడు. బల్ల పైన ఉన్న ఆదివారం పేపరు అనుబంధం తీసుకొని పేజీలు తిప్పుతున్నాడు. ఓ గేయం లాంటి గాయం- కనిపిస్తే నాకు వినపడేలా చదివాడు.

"టౌనుకు చేరితివి కద బిడ్డా. ఏడుపెందుకు?
అమ్మా అయ్యా చనిపోయినారు.
అరె! వాళ్ళెందుకు పోయిన్రు.
కవులు-పొలాన-ప్రత్తేసి-అప్పులపాలైనారు.
ప్రత్తే ఎందుకు ఏస్తిరి బిడ్డా!
ఏమో- నాకు తెల్వది.
అట్ల పోయినోళ్ళకు ప్రభుత్వం బోలెడు పైసలిస్తున్నది గద!
ఇస్తనంటే ఆరు నెలలు తిరిగినం- తిరిగినందుకు 'గాసం' మాత్రం దొరికింది.
మిగిలింది నా చేతికి రాలేదు. ఇచ్చిందే ఎక్కువ పో అన్నరు చివరన.
ఉండి చేసేందుకు ఆడ పని దొరక్కపాయె. గతిమాలి ఇట్లా చేరినం!" అంటూ నవ్వుతూ చదివాడు.

నడుస్తున్న తీరుకు నిజంగా నవ్వాలో ఏడ్వాలో



అర్థం గాలేదు. మనదేమో పూర్తిగ వ్యవసాయకపు దేశమాయె. మొలతాడున్న ప్రతి నాయకుడూ, 'రైతే' రాజు అంటుంటిరి. మరి ఇక్కడ రైతు సచ్చుడేంది? చావుకు ఇంతని పైసలిచ్చుడేంది? రంగు చొక్కాల పైరవీలేంది? తలను ఎక్కడ పెట్టుకోవాల్నో బొత్తిగ తెలువకపాయె. పాలనా తీరుకు మనస్సు చెదరిపోతుండె. అసలు ఈ దేశాన ఉన్న రాజకీయ పార్టీల తీరు- మరీ విడ్డూరమనిపిస్తది. తమకు ఏది తోస్తే దాన్నే సిద్ధాంతమనుకోవడం- దాన్ని బలవంతాన మనపైన రుద్దడం- మన కాలాన్ని హరించడం- తమ బాధ్యతలేమిటో తమకే తెలీకపోవడం- మన బాధ్యతలను గుర్తు చేయకపోవడం- అరచేత వైకుంఠాన్ని చూపుతూ- కొత్త ఆశల్ని (అప్పనంగా) పెంచడం- ఛ.ఛ. అనిపించింది.

ఇంతలో గేటు ముందర ఓ మినీ వ్యాను వచ్చి ఆగింది. 'ఇక్కడెందుకాగింది?' అనుకొని అటుగ చూసాను. ఆరుగురు టీనేజీ ఆడపిల్లలు- వ్యాను నుంచి కిందకు దిగారు. దిగి, లగేజీలను సర్దుకొని- చేత పుచ్చుకొని ఇటే బయలుదేరారు.

ఇంతలో సాంబిరెడ్డి గారు మోటారు సైకిలుపై లోనికొచ్చారు. నేను ఎదురు వెళ్ళి 'నమస్తే సార్' అన్నాను. నాతో మా సుదర్శనమూ వచ్చాడు.

'పిల్లలొచ్చారు' అన్నాడు వస్తున్న వార్ని చూపి.

'ఇరవయ్యో తారీఖు అన్నమాట'- అనుకున్నాను.

సామాన్ల బరువుతో లోనకొస్తూ- కొందరు 'నమస్తే' అన్నారు నావైపు అదోలా చూసి.

నేను లోనకు నడచి- గదులు తెరచాను- చూపాను. వాటి ఎదురుగనే హాలు ఉంది. యాసటగ వచ్చి, గదులను అలవోకగ చూసి- సామాన్లను కుప్పగ పడేసి బరువు దించుకున్నారు. హాల్లోకి జరిగి అలసట తీర్చుకునేందుకు నిల్చున్నారు. మంచినీళ్ళ కుండను చూపాను. ఇద్దరు ముగ్గురు వెళ్ళి తాగివచ్చారు. ఆనక వ్యాను దగ్గరకు నడచారు. ఇంకా సామాన్లు, మిగిలి ఉన్నయేమో తెచ్చుకునేందుకు వెళ్ళారనుకున్నాను.

'నాల్గయిదు రోజులలో వస్తారు. వచ్చాక ఇక ఎటూ వెళ్ళరు. మీ దగ్గర ఉంటూ- మీ చేలూ గట్రా చూస్తారు' అన్నాడు నవ్వుతూ.

లేచి– 'ఇక వెళ్తాను' అని మెట్లు దిగి మోటారు సైకిలెక్కాడు. ఆయన వెంటే వ్యానూ కదిలింది.

ఇంట్లోకొచ్చి చూసాను. గదుల తలుపులు బార్లా తెరచి ఉన్నాయి. సామాన్లు చల్లాచెదురుగ ఉన్నయి.

'పిల్లలు గద' అని నవ్వుకొని గదుల తలుపులు మూసాను. అణకువ తరిగితే అందం కూడా– అదోలా ఉంటుంది– అనిపించింది.

'ఏందిది?' అనడిగాడు మా సుదర్శనం.

'కాలేజి పిల్లలు. చదువు కోసం వచ్చారు. వ్యవసాయం కళాశాల నుంచట. నాల్గ నెలలుంటారు' అన్నాను.

'అలాగా! అన్నట్టు చూసి– తిరిగి పేపరున తలదూర్చాడు. ఆ వెంటనే– నాకు వినపడేట్టుగ– 'రోడ్డు ప్రమాదాన ఇద్దరి దుర్మరణం. నల్గురికి గాయాలు– ఒకరికి ప్రమాదస్థితి' అని చదివాడు. అసలక్కడ ఏం జరిగిన మనం ఏం చేయగలం? అందులో మనోళ్ళు ఎవరన్న ఉంటే– గబగబ పోయి నిలబడి చూసి– ముక్కు చీదేసి రావడం తప్ప! అసలూ ఇలాటి వార్తలు మనకు తెలియడం అవసరమా? మరెందుకు వ్రాస్తున్నట్టు? వాటిని ఆరాటంగ మనం ఎందుకు చదువుతున్నట్టు? అనిపించింది. మా గురువు గారొకాయన– వారానికో రోజు పేపరు చదివితే సరిపోతదిరా! అనేవాడు. "అక్కడ బాంబుదాడి– ఇక్కడ భూకంపం– అర్జంటీనాలో విమాన ప్రమాదం. మధ్యన ఓ ఆడకూతుర్ను రేపు చేయడం– ఓ సర్పంచును దించడం. ఓ (ఎస్.టి.) కేసు. ఇలా వీటిని మనం అర్జంటుగ తెల్సుకొని ఏం చేయగలం? లేనిపోని టెన్షన్. రాత్రి నిద్రన మిగిలిన ప్రశాంతత చెడిపోవడం తప్ప.

✧✧✧

తోటివార్ని ప్రేమించకున్నా– మంచిగ చూడడం నేర్చుకుంటే– మనకున్న మంచితనం పెరుగుతది. ఓ గోరువంక ఉన్నది. దానికి వయసొచ్చింది. చిలకనొకదాన్ని మనసున్నా లేకున్నా జత చేసుకున్నది. అది మూడు గుడ్లు పెట్టింది. పొదిగింది. పిల్లలయినయి. అప్పుడనుకున్నది– సంసారం బాగానే ఉన్నదని. ఒక్కోసారి– ఏదో గుర్తులోకొచ్చి– పరేదో బాగుందనిపిస్తది. ఎందుకో తెలీదు. ఏదిఏమైనా అనుకున్నది అనుకున్నట్టుగ జరగడం కష్టం గద!

ఒకనాడు– చిన్నది– గూడొదలి ఆరు బయట ఆడుతూ 'డేగ' కంటపడ్డది. అది 'ఆకలి' యాత్రన ఉన్నట్టుంది. తన్నుకొని పోయింది. తినేసి ఉంటుంది. ఆహారం గద! కూన అర్ధాంతరంగ పోయినందుకు చానా బాధేసింది. మానసికంగ కుంగదీసింది. ఈలోపు మిగిలినవి ఎదిగినయి. రెక్కలు సాగినయి. వయస్సొచ్చింది. వచ్చాక ఆగవు గదా! జంటల్ని వెతుక్కున్నయి. వేరుగ గూళ్ళు కట్టుకున్నయి. ఎడంగ జరిగిపోయినయి.

అవి దూరమయ్యాక– చిలక్కి జబ్బు చేసింది. చేసాక కుదరలేదు– రోగం తీసుకొని అదీ పోయింది. గోరెంక ఒంటరిదయింది. మరో చిలక కోసం వెతకాలనిపించలేదు. అది పోయినా మళ్ళీ వెతుకులాటే గదా! అసలు గోరింక నడక ప్రారంభమే ఒంటరితనం నుంచి గద! ఇంత కాలానికి మళ్ళీ ఒంటరితనం. అది ప్రారంభం– ఇది ముగింపునా! అనిపించి నవ్వొచ్చింది. మనస్సు నిండా ఆనందం నింపిన నవ్వు అది. 'అవునూ! దేనికయినా ముగింపు ఉండాలి గదా!' అనిపించగనే– కళ్ళు చెమ్మగిలినయి. అర్థంకానిది గదా ముగింపు. చిన్నతనం గుర్తుకొచ్చింది. మనస్సును కదిలించేలా మెదలింది. చిన్నతనం గొప్పదే కాదు (ఒంటరితనాననైనా) చానా అందమైనది. అద్భుతమైనది. శక్తివంతమైనది. జీవికి నిజంగా మనస్సు ఉంటే– ఆ అనుభూతే చాలు! అనిపించింది.

కళ్ళు మూసుకుంది.

ఆనందం కట్టలు తెంచుకున్నది.

తెలీకుండానే కంటెంట నీరు జారింది.

✧✧✧

'పని' ఎవ్వరినీ ఎప్పుడూ తక్కువగ చూడదు. మంచి ఫలితాన్నే ఇస్తది. పని చేస్తున్నట్టుగ నటించడం– అది అతన్నే కాదు. చుట్టూరా ఉన్న సమాజాన్నీ చెడుపుతది. నాల్గు నెలలు. ఇట్టే గడచిపోయినవి. పిల్లలు బాగా చదివారు. రికార్డులు వ్రాసారు. చేలు తిరిగారు. పైర్లను

గమనించారు. వాటి దశలనూ, రుగ్మతలనూ ఫోటోలు తీసారు. ఏయే దశన ఏ పురుగు ఏ రుగ్మతకు హేతువౌతదో గమనించారు. అధ్యయనం చేశారు. ఉపాధ్యాయులను వింటూ ప్రత్యక్షంగా పైర్లను గమనించారు.

మౌఖిక పరీక్షలు బాగా చేసారు.

పట్టుదలగ పని చేసే వాళ్ళకు- అదృష్టం కోసం వేరుగ చూడాల్సిన పని ఉండదు. పరీక్ష ముగిసిందాకా మాత్రం- మరీ, చివర నాల్గు దినాలు- అమ్మో! చాలా చాలా టెన్షన్‌లో ఉన్నారు. ఒక్కొక్కరు ఆరేడు వందల పేజీల రికార్డు వ్రాయాలాయె. శాంపిల్సు అంటించాలాయె. ఇవిగాక ఫోటోలు- ఎవరి వ్రాత కోతలలో వారు మునిగి ఉండి. "తాతా! ఆ పైరెప్పుడు వేసారు? దాని పూర్తి పంట కాలమెంత? చనగపచ్చ పురుగుకు ఏం కొట్టారు? దానికి సాంబిరెడ్డి గారు ఏం చెప్పారు? గుర్తుందా? ఆఁ! ఆయన ఇవాళ వచ్చి క్లాసు తీసుకుంటాడా? ఇదిగో. ఈ రికార్డులో వరసగా అంకెలు వెయ్యి- ఇదిగో తాతా! ట్యాగులు కావాలి. ఇవ్వాళ్ళ నీళ్ళు పోసేవాడు రాకుంటే ఎలా? ఆఁ అంకు పొలాన ఓ ఫోటో మిగిలిపోయింది. మా రైతుతో కూడా నాకో ఫోటో. కావాలి. ఖమ్మం వెళ్తే తినేందుకేమైనా పట్రా! రేపు మా హోష్టు రైతు ఖమ్మం వస్తాడా! ఇలా ఎవరి అక్కరను పట్టి వారు. రికార్డులు పూర్తి చేసుకుంటూనే. వరస క్రమంలో ఫోటోలు అంటిస్తూనే.

ఇలా ఉంటూనే ఏదో టైంలో ఇన్ని బియ్యం పొయ్యి పైన వేయడం.

మరి కూరలు? పచ్చడి సీసాలు ఖాళీ-

ఆకలికి రుచి తెలీదు. ఏదైనా బాగానే ఉంటది. ఈ వత్తిడికి న్యాయంగ బాగా ఆకలవుతది. పైగా ఎదిగిన పిల్లలు. వాళ్ళు పడుతున్న శ్రమకు మనస్సు విలవిలలాడేది? చదువు పట్ల వారికున్న శ్రద్ధకు ముచ్చటేసేది. అవును- కష్టపడితేనే గదా ఫలితం అనిపించేంది- తృప్తిగ చూసేవాణ్ణి. ఏ వక్కరూ నన్ను గమనించే వారు కాదు. ఎదురు పడితేనో- పిలిస్తేనో తప్ప.

ఆవేళ. చివరిరోజు. రైతులకు వీడ్కోలు

## రాత్రి-పగలు

షరా మామూలుగా
మళ్ళీ తెల్లారుతుంది
తల మీంచి ధారలు కట్టిన
చీకటి మరకల్లోంచి
ఏదో ఒక సందర్భం
కళ్ళమీద చిట్లితే తప్ప
చూపు రాజుకోదు
మనసులో రగిలితే తప్ప
మాట రాజుకోదు

మౌనం ఎప్పుడూ ప్రశ్నార్థకమే
ఒక శబ్ద సృజనకు ముందు
అనంత చలనాలకు
ఆయువుపట్టు మౌనం...

ఒకడు అశ్రుకణ సముదాయాల్ని
దోసిట్లో కెత్తుకుంటాడు
నెత్తురోడుతున్న గాయాల్ని సమీకరిస్తుంటాడు
వాటి కారణాల్లోకి చూపు సారించి
మూలాల్ని నిలదియ్యగలడు
ఆలోచనై అంకురించగలడు
వాడి చేతిలో క్షణాలు
కార్యాచరణాలై
వాడి సంయమనం మీద సానబెట్టుకొని
పదునెక్కిన ఆయుధాలౌతాయి
వాడొక్కడే కాలాని కతీతంగా
నిలబడగలడు
కాలాన్ని నిర్దేశించగలడు
దాటిపోతున్న కాలం
కలకలాన్ని మధించి
దాటాల్సిన భవిష్యత్తు కోసం
సరికొత్త దారులు తెరుస్తుంటాడు

నిత్య చైతన్యశీలికి
రాత్రి ఓ రహస్య పాఠశాల
పగలు ఓ అనుభవాల ప్రయోగశాల

-వర్ధుల శివకుమార్

చెప్పేందుకు భోజనాలూ గట్రా తయారు చేసారు. వాళ్ళకు పాఠాలు చెప్పిన వారినీ, సహకరించిన వారినీ, మిగిలిన పిల్లలనీ- పిలిచారు. చిన్న ఫంక్షన్‌లా చేసి, చివరన హడావుడి పడ్డారు. అంతా ఫోటోలు దిగారు. సాంబిరెడ్డి గారూ కాలేజీ నుంచి వచ్చిన డాక్టర్ జయరాజ్ మాట్లాడారు. ఆనక శ్రద్ధగ భోజనాలు వడ్డించారు. నవ్వుతూ నవ్విస్తూ కొసరి కొసరి మరీ తినిపించారు. సరదాగా గడిపారు. మొఖాన నవ్వు చెదరనివ్వలేదు. భోజనాల తరువాత- బయట వాళ్ళంతా వెళ్ళిపోయాక సుడిపడి చతికిలపడిపోయారు. పిల్లలు గదా!

ఆ రాత్రి 'వసంత' బయటకొచ్చినపుడు- అడిగాను. 'ఎప్పుడెళ్తున్నారు?' అని.

నా మనస్సప్పటి నుంచి వ్యాకులంగా ఉంది. ఎందుకో తెలీదు. తిండి కూడా సరిగ్గా తినబుద్ధి వేయలేదు.

'మొదట పొద్దుటే అశ్వారావుపేట వెళ్ళి రికార్డు అప్పగించి వస్తాం. ఆనక- వెళ్ళిపోవాలి' అంది.

ఆ రాత్రి మాత్రం- అన్నీ మరచి- ఆరామ్‌గ పక్కలెక్కారు.

అమ్మా వాళ్ళపైన అలిగిననాడు- 'ఇంట' పడుకున్నట్టు.

అలసి ఉన్నారు గనుక ఆదమరచి నిద్రపోయారు. ఒకళ్ళిద్దరు పలవరించారు కూడా.

◇◇◇

పొద్దు పొడుపు-

ఎప్పుడూ అందంగనే ఉంటది. చూసే మనస్సుండాల-

> ## ఏది నిజం
>
> **చ**రిత్ర
> ఇక్కడంతా
> సుభిక్షం... సుభిక్షం
> అని బోధిస్తుంది....
> వర్తమానం
> భిక్షం... భిక్షం...
> అంటూ చేయి చాస్తుంది...
>
> -పెరుగు రామకృష్ణ

నీరెండలో- అశ్వారావుపేట కాలేజీకి బయలుదేరారు- చేరారు- అప్పగించారు.

రాత్రవుతుండగా- తిరిగొచ్చారు. జోగుతున్నారు. చాలా దూరమాయె. ప్రయాణ బడలిక. వచ్చిన దగ్గర నుంచీ. సామాన్ల ప్యాకింగు. ఇళ్ళకెళ్ళాలి గదా పండుగకు కూడా పోరైతిరి. వారి వారి పనులను ముగించుకొని- ఒక్కొక్కరు వచ్చి. నా ఎదురుగా ఉన్న కుర్చీలలో చతికిలపడ్డారు. అలసట వార్ని వదలలేదు.

కూర్చున్న తరువాత కూడా- ఏవో గుర్తులోకి రావడం- మళ్ళీ లోనకెళ్ళడం వెతకడం మళ్ళీ రావడం. మధ్య మధ్యన ఒకర్నొకరు పిలుచుకొని 'సరితా! ప్యాడ్ నీ దగ్గరుందా! అదేదీ! నీ దగ్గర ఉందేమో చూడు! శిరీషా! డ్రస్సేది- ఫోటోలు కనిపించడం లేదు! పార్వతి నీ కెమెరా ఏది? దాచావా? సామాను ఎలా తీసుకెళ్తావే? ఎవరైనా వస్తారా? గుడ్డూ కోసం వాళ్ళ నాన్న వాస్తడుట. పార్వతి పాల లెఖంత? చున్నీ కనపడలేదన్నావు. ఇదిగో ఇలా ఆగకుండా జనాంతికంగా మాటాడుతూ లేస్తూ కూర్చుంటూ- తిరగలిలా తిరుగుతూ తిరుగులాటలోనే మంచాలెక్కడం- దిగడం- గదుల్లోకెళ్ళడం- నా ఎదురుగ రావడం ఇదంతా చూనస్తూ వింటూ నాలో నేను నవ్వుకొనడం తప్ప ఏం చేయను. పసివాళ్ళయితే ఎత్తుకొని ముద్దు చేద్దును. సముదాయిద్దును.

కొద్దిసేపయ్యాక- పార్వతి లోన నుంచి వచ్చి 'ఇక తిందాం' అంది చేతనున్న పేపరు కిందేసి.

వసంత తలూపింది- దానికి నిజంగానే ఆకలి మండిపోతున్నట్టుంది.

గుడ్డూ మాటాడలేదు- దాని వంట ఇంకా పూర్తవనట్టుంది.

అలా అటూ ఇటూ తిరుగాడారే తప్ప ఘంటకు గాని అంతా తిండికి లేవలేదు.

లేస్తూ మాత్రం- 'తాతా! నువ్వూరా!' అని పిలిచారు.

పది నిమిషాల్లో తిన్నామనిపించుకొని- లేచారు.

ఇంటికెళ్తున్నామన్న సంతోషంతో పాటు- ఏదో అనమానం- అలజడి- వారిలో

కనిపించింది.

చీట్ల పేకతో 'గుడ్డూ' నా దగ్గరకొచ్చి కూర్చుని- 'చీట్లాడుదాం' అంది ముక్కలు కలుపుతూ.

'కాసేపు పోట్లాడుకుందామని ఉన్నది' అంది స్నేహ.

వసంత- కూనిరాగం అందుకుంది వస్తూ- సరిత- దానితో గొంతు కలిపింది.

'ఏయ్! ఇక ఆ టేపు ఆపండి- ఇక్కడ వర్ని విందాం! రెండూ ఒకేసారి జీర్ణం కావే' అంది పార్వతి.

'ఈనో ఫ్రూట్ సాల్ట్. ఇంటిల్లపాదికీ- అంది సరిత పెద్దగా టి.వి. యాంకర్‌లా.

'వేరే బ్రాండు ఏదన్నా ఉంటే చెప్పమ్మా! అందరం వాడదాం!' అంది శిరీష.

'దీనివరకే అయితే కలవొచ్చు' అంది వసంత నవ్వుతూ.

'మనమంతా ఒక్కటి గదే! ఒక్కటే! ఎప్పుడైనా ఎక్కడైనా'- అంది స్నేహ దబడబ.

'ఒక్కటయితే మాత్రం- కొన్ని వదిలేయాలి. మంకు కుదరదు- దానిదంతా తొందర. పూర్తిగ ఏదీ తెల్సి చావదు' అంది శిరీష- అదోలా దాన్ని చూస్తూ.

'నల్గురున బ్రతుకుతున్నాం కనుక మన్ని కట్టుకున్న వెధవల్ని వదిలేద్దామా? అక్కడ ఒక్కటే అని గీ పెట్టినా కుదరదు గదా!' అంది సరిత నవ్వుతూ.

ఓ! అని నోరెళ్ళ పెట్టింది స్నేహ. అంతా నవ్వులు- హరివిల్లులా.

ఇంకా ఏదేదో మాట్లాడుకుంటున్నారు. నేను వింటున్నానుకుంటున్నారో? వింటే ఏం? అనుకుంటున్నారో? నేనెవర్ని? ఎవరికి తాతను? ముసలాడిలా నెరసిన జుత్తుతో కనిపించానని అలా పిలిచారు తప్ప. మళ్ళీ వాళ్ళు కలుస్తారు. కాలేజీ ఇంకా ఆరు నెలలుంది గనుక-

మరి నేను?

కళ్ళలో చెమ్మ, మళ్ళీ పాత కథే. పాత ఒంటరితనమే.

మరి ఈ అనుబంధమేమిటి? ఇంతగా అరమరికలు లేకుండా దగ్గరయ్యారే? ఎందుకు? వీరు వెళ్ళిపోతారని వచ్చిననాడే తెల్సు గదా! ఈ దగ్గరితనం ఎందుకు? ఇంత కలివిడి?

'అరె! వాళ్ళ ఇళ్ళకు, వాళ్ళు పరీక్షలయి వెళ్తుంటే సంతోషంగ పంపాల్సింది పోయి- ఏమిటీ వెల్తి- ఎందుకిలా అనిపిస్తున్నది?

వీరు వెళ్ళిపోతే అసలు నేను ఉండగలనా? ఇదేమిటి?

అసలు వీరెవరు? నేనెవర్ని- మాకున్న రక్త సంబంధమేమిటి? ఏమీ లేదే?

ఎందుకిలా అనిపిస్తున్నది? అర్థం కాలేదు. ఏదో అర్థమయినట్టు అనిపించే వేదన, బాధ. నేను ఇక్కడే ఉండాలి. ఉంటాను. ఉండకపోతే ఎలా? నాకిక్కడ కొన్ని బాధ్యతలున్నయ్. అందుకే ఉంటున్నాను. కన్న అమ్మ నాన్నలు నన్నొదలి పోయినపుడు.

'మేమే' అంతా అనుకున్న బాబాయి పిన్ని పోయినపుడు.

'నటరాజు' అర్ధాంతరంగా పోయినప్పుడు- ఉన్నాను కదా!

అవును. ఈ గాలి పోయిందాకా ఉండాలి. కాల ధర్మమది.

అది ఉన్నది గనుక ఇవీ ఉంటయి. అనుబంధ బంధాలివి.

నవ్వొచ్చింది. పెద్దగ నవ్వాలనిపించింది. కూర్చున్న చోట నుంచి లేచాను.

ఆ నవ్వులో బాధ- బాధలోనే, వీళ్ళూ నా పిల్లలే- అన్న భావన. మళ్ళీ నవ్వు. దాని వెనకే శూన్యం. శూన్యం వెనుక తెలియని అలజడి, భయం. దాని వెనుక నిశ్శబ్దం. అదేమిటని ఎంత తెల్సుకున్నా- తెలీనితనం- తెగని అనుబంధం. దగ్గరితనం. ఆరుగురినీ నీళ్ళు నిండుతున్న కళ్ళతో విడివిడిగ చూసాను- కన్నీట కనిపించకుండా పోతున్నారు. వాళ్ళు గమనించకుండా కళ్ళొత్తుకున్నాను. నడచాను. వారి దగ్గరకు నడచాను. వారి భుజాలపై చేతులుంచి- 'వస్తుండండి' అన్నాను. గొంతున జీర. తలలూపారు నన్నే చూస్తూ. వారి కళ్ళలోనూ తడి. అమ్మను విడిచిపోతున్న కూనల్లా ఉన్నారు.

తాత పిల్లలకే ఈ కథ.